**విలేకరులు కావలెను**

మనవార్త దినపత్రిక లో
పనిచేయుటకు విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్రంలో అన్ని జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మరియు నియోజక వర్గాల వారిగా మండల స్థాయి రిపోర్టర్లు కావలెను

Cell:9247819181, 8309605189



TITLE Code TEL TEL12230

# మన వార్త

ప్రజాగళానికి అక్షర రూపం

MANA VAARTHA





హైదరాబాద్,కరీంనగర్,పెద్దపల్లి,రాజన్న సిరిసిల్ల | మంగళవారం 18 జూన్ 2024 | పేజీలు : 4 వెల : రూ.2


# మత్స్యకార మహిళలకు

## భరోసా ఉందా..?

- చేపల వేటలో నిమగ్నమైన లక్షలాదిమంది మత్స్యకారులు
- మత్స్యకార రంగంలో కీలక పాత్ర పోషిస్తున్న మహిళల
- మత్స్యకార మహిళల్లో అక్షరాస్యతను పెంచాలి
- ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచడానికి అసవరమైన చర్యలు తీసుకోవాలి



డెస్క్ : రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 14వ తేదీ నుండి సముద్రంలో చేపల వేటపై నిషేధం తొలగిపోయింది. దీంతో తీర ప్రాంతానికి మళ్లీ కళ వచ్చింది. లక్షలాదిమంది మత్స్యకారులు చేపల వేటలో నిమగ్నమైనారు. 2022 నాటి మత్స్యశాఖ గణాంకాల ప్రకారం రాష్ట్రంలో సుమారుగా 8.75 లక్షల మత్స్యకారులు ఉన్నారు. వీరిలో 4.13 లక్షల మంది మహిళలు. అంటే, దాదాపుగా 47 శాతం! రాష్ట్ర జిఎస్‌డిపిలో మత్స్యకార రంగం వాటా 6.01 శాతం! దీనిలో మహిళల శ్రమ వాటా గణనీయంగా ఉంటుందన్న విషయం ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. సముద్రం మీద వేటను మినహాయిస్తే, ఆ తరువాత అన్ని దశల్లోనూ మత్స్యకార మహిళల ఈ రంగంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే వీరి ప్రమేయం లేకుండా మత్స్య సంపద వినియోగదారుల వద్దకు చేరే అవకాశమే లేదు. అయితే, ప్రభుత్వం నుండి వీరికి ఎటువంటి మద్దతు లభించడం లేదు. చేపల వేట అనగానే పురుషులకే పరిమితమైన రంగంగా చూడటం అలవాటు కావడంతో ఇక్కడ మహిళలు పెద్ద ఎత్తున చేస్తున్న శ్రమకు ఎటువంటి గుర్తింపు లభించడం లేదు. 2011 లెక్కల ప్రకారం 12,747 మోటరైజ్డ్, 1771 మెకనైజ్డ్, 14,677 సాంప్రదాయ బోట్లు రాష్ట్రంలో ఉండేవి. గడిచిన పదేళ్ల కాలంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించిన విధానాల కారణంగా మత్స్యకారుల జీవన విధానంలో గణనీయమైన మార్పులు వచ్చాయి.

# ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బలైన యువకుడు



రామాయంపేట : ఓ యువకుడు ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యసనం భారీన పడి చేతిలో డబ్బంతా పోగొట్టుకున్నాడు. అంతటితో ఆగకుండా తెలిసిన వాళ్ల దగ్గర కూడా అప్పులు చేశాడు. బెట్టింగ్ మాయలో పడి తీవ్రంగా ఆర్థికంగా నష్టపోయిన సదరు యువకుడు చివరకు ఆత్మహత్య చేసుకుని తనువు చాలించాడు. ఈ విషాద ఘటన మెదక్ జిల్లాలో వెలుగు చూసింది. మెదక్ జిల్లా రామాయంపేట మండలం ప్రగతి ధర్మారం గ్రామానికి చెందిన దొమ్మాట నర్సింలు కుమారుడు దొమ్మాట భానుప్రసాద్ (24) అనే యువకుడు గత కొన్నిరోజులుగా ఆన్‌లైన్‌లో గేమ్‌లు ఆడుతున్నాడు. ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడిన భాను ప్రసాద్ రూ.1.50 లక్షలు పోగొట్టుకున్నాడు. పైగా తెలిసిన వారి వద్ద కూడా అప్పులు చేశాడు. ఆర్థికంగా నష్టపోయిన భానుప్రసాద్ తీవ్ర మనస్తాపానికి గురై ఐదురోజుల క్రితం తమ వ్యవసాయ బావివద్దకు వెళ్లి పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే రామాయంపేటలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానకు అతడిని తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ భాను ప్రసాద్ మృతి చెందాడు. ఒక్కగానొక్క కొడుకు కళ్ల ఎదుటే చనిపోవడంతో తల్లితండ్రుల రోదనలు మిన్నంటాయి. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

# కాంగ్రెస్ పాలనలో యువత

## ఆందోళన చెందుతుంది

- కేసీఆర్ బొమ్మ ఉందని సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఇవ్వట్లే...
- నిరుద్యోగులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది...
- ఉపముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు ఏమయ్యాయి...
- పేదల పట్ల ఇంత వివక్ష ఎందుకు...
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ...



హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వంలో యువత ఆందోళన చెందుతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. నిరుద్యోగ యువతి, యువకులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. జాబ్ క్యాలెండర్ జాడ పత్తా లేదని విమర్శించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో పార్టీ నేతలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గ్రూప్ పోస్టులు పెంచాలని కోరారు, ఇప్పుడు గ్రూప్ విద్యార్థులు పోస్టులు పెంచాలని కోరితే స్పందించడం లేదన్నారు.గ్రూప్ 1 ప్రిలిమ్స్ లో పాస్ అయిన విద్యార్థులకు 1:50 కాకుండా 1:100 చొప్పున మెయిన్స్ ఎగ్జామ్‌కు అవకాశమివ్వాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. తద్వారా ఎంతో మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు మేలు జరుగుతుందని చెప్పారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 1:100 విధానం అమలు చేస్తామని విద్యార్థులకు హామీ ఇచ్చారని, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా అసెంబ్లీ సాక్షిగా చెప్పారని గుర్తుచేశారు. ఉపముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు ఏమయ్యాయని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం యుతను మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాన ప్రతిపక్షంగా ప్రభుత్వాన్ని నిలదీయాలని అభ్యర్థులు బీఆర్ఎస్ కార్యాలయానికి వచ్చి వినతిపత్రం ఇచ్చారని చెప్పారు. గ్రూప్స్ పరీక్షలకు మధ్య వ్యవధి ఉండాలని అభ్యర్థులుకోరుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వచ్చి ఆరు నెలలయిందని, ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయలేదని విమర్శించారు. పింఛన్ ఎప్పుడిస్తరని అవ్వతాతలు అడుగుతున్నారని చెప్పారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు క్రమం తప్పకుండా పెన్షన్ వచ్చేందని అంటున్నారని తెలిపారు. రెండు నెలల నుంచి ఆసరా పింఛన్ రావడం లేదని వెల్లడించారు. అవ్వతాతలకు ఇచ్చిన మాటను ఎందుకు నిలబెట్టుకోలేకపోతున్నారని ప్రశ్నించారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న పింఛన్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాపాలన పేరుతో తీసుకున్న ఆరు గ్యారంటీల దరఖాస్తులు ఏమయ్యాయని ప్రశ్నించారు. ప్రజాపాలన ఆచరణలో ఏమైందన్నారు. పేదల పట్ల ఇంత వివక్ష ఎందుకని నిలదీశారు. ఏపీ సీఎం మొదటి సంతకంతో పింఛన్ రూ.4 వేలకు పెంచారని, మీరు ఎప్పటి నుంచి ఇస్తారో చెప్పాలన్నారు. పక్కన ఆంధ్రప్రదేశ్ ఇచ్చినప్పుడు మీరెందుకు ఇవ్వలేకపోతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. వికలాంగులకు రూ.6 వేల పింఛన్ వెంటనే ఇవ్వాలన్నారు. చేనేత, గీత కార్మికులకు, ఎయిడ్స్ రోగులు, డయాలసిస్ పేషెంట్లకు బీఆర్ఎస్ హాయంలో పెద్ద ఎత్తున పింఛన్ ఇచ్చామని చెప్పారు. ఇంటికి రెండు పింఛన్లు ఇస్తామన్నారని గుర్తుచేశారు.

# జలమయం అయిన

## భాగ్యనగరం



హైదరాబాద్: హైదరాబాద్‌లో భారీ వర్షం పడుతోంది. సోమవారం మధ్యాహ్నం ఒక్కసారిగా ఆకాశం మేఘావృత్తమే భారీ వాన కురుస్తోంది. మధ్యాహ్నం 3 గంటల తర్వాత భారీ వర్షం కురుస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతున్నారు. నగరంలోని జూబ్లీహిల్, బంజారాహిల్స్, ఫిల్మీంనగర్‌లో భారీ వర్షం పడుతోంది. వర్షం పడుతుండటంతో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య నెలకొంది. వర్షం ధాటికి చాలా ప్రాంతాల్లో చెట్లకొమ్మలు విరిగిపడ్డాయి. పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. వర్షం దంచికొడుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తెలంగాణవ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు విస్తరించిన నేపథ్యంలో మరో మూడురోజులు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది.


మన వార్త
ప్రజాగళానికి అక్షర రూపం
MANA VAARTHA
epaper
చదవడానికి QR కోడ్‌ను స్కాన్ చేయండి
http://manavaartha.net
MANA VAARTHA


# ఏపీని ఆసక్తిగా గమనిస్తున్న తెలంగాణ



హైదరాబాద్ : రేవంత్ రెడ్డికి గురువుగా భావించే చంద్రబాబు దూకుడుగా ముందుకు వెళుతుంటే, రేవంత్ రెడ్డి చంద్రబాబుకు దీటుగా దూకుడు చూపించలేకపోతున్నారా అన్నది ఏపీ, తెలంగాణలో చర్చనీయాంశంగా మారింది. ఏపీని ఆసక్తిగా గమనిస్తున్న తెలంగాణా టిడిపి అధినేత చంద్రబాబు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఎన్నికలలో విజయం సాధించి టిడిపి కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి, పాలనలో తన మార్కు చూపించాలని ప్రయత్నం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టించాలని చంద్రబాబు చేస్తున్న ప్రయత్నాలు, రాష్ట్రంలో పోలవరం ప్రాజెక్టును త్వరితగతిని పూర్తిచేసి ఏపీ రైతాంగానికి సాగునీరు అందించాలని చంద్రబాబు ప్రణాళిక ప్రస్తుతం తెలుగు రాష్ట్రమైన తెలంగాణ కూడా ఆసక్తిగా గమనిస్తోంది. తెలంగాణా యువత దృష్టిని ఆకర్షిస్తున్న చంద్రబాబు నిర్ణయం అంతే కాదు చంద్రబాబు పాలనా పగ్గాలు చేపట్టిన తొలినాడే ఐదు కీలక ఫైళ్ళ పైన సంతకాలు చేశారు. ఒకటి ఏపీలో మెగా డీఎస్సీకి గ్రీన్ సిగ్నల్ ఇస్తూ చంద్రబాబు సంతకం చేయగా, స్కిల్ సెన్సెస్ కూడా చేపట్టనున్నట్టు చంద్రబాబు తెలిపారు. ముఖ్యంగా యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడానికి చంద్రబాబు తీసుకున్న నిర్ణయం ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర ప్రజల దృష్టిని ముఖ్యంగా తెలంగాణ యువత దృష్టిని ఆకర్షిస్తుంది. జాబ్ క్యాలెండర్ కోసం యువత డిమాండ్ గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉద్యోగాలు లేవని లబోదిబోమన్న నిరుద్యోగ యువతకు కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ఉద్యోగాలు వస్తాయని పెద్ద ఎత్తున ప్రచారం చేసి, రేవంత్ రెడ్డి సర్కార్ అధికారంలోకి వచ్చింది. ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ సర్కార్ ఇప్పటివరకు ఆ ప్రయత్నం చేయలేదు. ఈ క్రమంలోనే తెలంగాణాలోని యువత ఉద్యోగాల కోసం త్వరలో జాబ్ క్యాలెండర్ ఇవ్వాలని రేవంత్ సర్కార్ను డిమాండ్ చేస్తుంది.

## ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ని కలిసిన జగిత్యాల ఇన్చార్జి డిఎంహెచ్ఓ..



**వేములవాడ, జూన్ 17 (మన వార్త ప్రతినిధి నందు రావు):** జగిత్యాల జిల్లా ఇంచార్జ్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ సమ్మిఉద్దీన్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ నీలారపు శ్రీనివాస్ లు సోమవారం ఉదయం ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ కు పుష్పగుచ్చాము అందజేశారు.

# వేములవాడ పట్టణంలో బక్రీద్ వేడుకలు..



**వేములవాడ, జూన్ 17 (మన వార్త ప్రతినిధి నందు రావు):**
సోమవారం రోజు బక్రీద్ పండుగ పురస్కరించుకొని వేములవాడ పట్టణంలో ఈద్గా లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడం జరిగింది. ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో హిందూ ముస్లిం భాయి భాయి లాగా ఉండి శాంతిని నెలకొల్పే విధంగా ఉండాలని ప్రార్థన చేయడం జరిగింది.

# మందమర్రిలో ఘనంగా బక్రీద్ వేడుకలు



**మంచిర్యాల్ జూన్ 17 ( మన వార్త ప్రతినిధి )** మందమర్రి పట్టణంలో సోమవారం బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. ఉదయమే ఈదగల వద్దకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత పెద్దలు చెప్పిన విధంగా ప్రార్థనలు గావించారు. బక్రీదు విశిష్టతను తెలియజేశారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సి ఆర్ క్లబ్ ఈద్గా వద్దకు చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి హాజరై ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగని చెప్పారు. ఈ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులు దానధర్మాలు కూడా చేయడం ఆనవాయితాన్ని చెప్పారు. తమ ప్రభుత్వం ముస్లింల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నది పేర్కొన్నారు.

## మున్సిపల్ చైర్మన్‌కి ఆహ్వాన పత్రిక అందజేసిన వంగపల్లి అంజయ్య స్వామి



**గజ్వేల్ జూన్ 17 (మన వార్త ప్రతినిధి జీ మురళి)** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళికి సోమవారం ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ప్రమాణ స్వీకారం ఆహ్వాన పత్రిక అందజేసిన రాష్ట్ర ధార్మిక పరిషత్ చైర్మన్ డాక్టర్ వంగపల్లి అంజయ్య స్వామి ఈ సందర్భంగా వంగపల్లి అంజయ్య స్వామి మాట్లాడుతూ ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త ఆదేశానుసారం యాదాద్రి భువనగిరి జిల్లా ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ కమిటీ ప్రమాన స్వీకార కార్యక్రమానికి రావాల్సిందిగా మున్సిపల్ చైర్మన్ రాజమౌళికి ఆహ్వాన పత్రిక అందజేయడం జరిగిందని అలాగే సీనియర్ నాయకులు నంగునూరి సత్యనారాయణ,సిద్ది బిక్షపతి, తోట బిక్షపతి,సిద్దిపేట జిల్లా ఐ వి ఎఫ్ అధ్యక్షుడు నేతి శ్రీనివాస్,యువజన అధ్యక్షుడు ఎన్ సీ సంతోష్,ఐ వి ఎఫ్ గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పట్టణ అధ్యక్షుడు కైలాస ప్రభాకర్,యువజన అధ్యక్షుడు కొమరవెల్లి శ్రవణ్,మరియు ఆర్యవైశ్య నాయకులకు ప్రమాణ స్వీకారం ఆహ్వాన పత్రిక అందజేయడం జరిగింది అని ఆర్యవైశ్యులకు ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ అండగా ఉ ంటుందని అన్నారు

## రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయ వార్షికోత్సవంలో పాల్గొన్న ప్రభుత్వ విప్..



**వేములవాడ, జూన్ 17 (మన వార్త ప్రతినిధి నందు రావు):** సిరిసిల్ల పట్టణంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయ వార్షికోత్సవం, కళ్యాణ మహోత్సవంలో ప్రభుత్వ విప్,వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు అమ్మవారి దయతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో ఉండాలని సకాలంలో వర్షాలు పడాలని వేడుకున్నారు.

# మందమర్రిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు

**-పట్టించుకోని మున్సిపల్ రెవెన్యూ అధికారులు**

**మంచిర్యాల్ జూన్ 17 (మన వార్త ప్రతినిధి)**
నాలుగు దశాబ్దల క్రితం మందమర్రి మార్కెట్ ప్రాంతంలో ఉన్న సుమారు 90 (ఎస్ సి ఆర్) సింగరేణి క్వాటర్స్ ను వ్యాపారస్తులుగా అద్దె ప్రాతిపదికగా సింగరేణి ఇచ్చింది, తెలంగాణ రాష్ట్ర అవతరించిన అనంతరం పట్టణంలోని ఓపెన్ ల్యాండ్స్ ను మాత్రమే సింగరేణి, రెవెన్యూ శాఖకు అప్పగించినట్లు అధికారులు సైతం వెల్లడిస్తున్నారు, దీనిని ఆసరాగా చేసుకుని మార్కెట్లోని నిర్వాహకులు బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతూ బ్యాంకులకు ఇతరత్రా వ్యాపారులకు నెలకు 30 వేల నుండి 40 వేల వరకు అద్దెకు ఇస్తున్నారు, సింగరేణి ఎస్ సి ఆర్ క్వాటర్స్ కాలగర్భంలో కలిసిపోయి వాటి ఆనవాళ్లు కూడా లేకుండా మిగిలిపోయాయి, అంతకుముందు అద్దె ప్రాతిపదికన తీసుకొని కైవసం చేసుకున్న నిర్వాహకులు కేవలం అవి ప్రభుత్వ ఆధీనంలోకి వెళ్లాయని ఒకే ఒక సాకుతో కమర్శియల్ నిర్మాణాలకు పునాదులు వేశారు, ఇలా నిబంధనలను తుంగలోకి తొక్కి కోట్లకు పడగలెత్తుతున్నారు, సింగరేణి కార్మికుడు దేశ ప్రగతితో పాటు సంస్థ అభివృద్ధికి తమ రక్తాన్ని చెమటగా మార్చి ఉద్యోగ విరమణ పొందిన అనంతరం క్వార్టర్లను కంపెనీకి అప్పజెప్పి పక్కన ఉన్న స్థలంలో చిన్న నిర్మాణం చేపట్టిన సింగరేణి అధికారులు ఉ క్కు పాదం మోపుతున్నారు. స్థానిక ఏస్టేట్స్ అధికారులకు మాత్రం ఈ నిర్మాణాలు ఏవి కానరాకపోవడం శోచనీయం, ఒకవేళ సింగరేణి ప్రభుత్వానికి అప్పగించి ఉంటే దానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను నిర్మాణాలు చేపడుతున్న చోట ఎందుకు అంటించడం లేదంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు, అంతేకాకుండా 1/70 గిరిజన చట్టాన్ని ఉల్లంఘిస్తున్న సంబంధిత మున్సిపల్ అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడకపోవడం వారి పనితీరుపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి, అంగ బలం, ఆర్థిక బలం ఉన్నవారికి అంట కాగడం అధికారులకు అలవాటేనని పలువురు ఆరోపిస్తున్నారు, ఏది ఏమైనా మందమర్రి మార్కెట్ లో మాత్రం అక్రమ నిర్మాణాలు యదేచ్ఛగా జరుగుతున్న తమకు ఏమి సంబంధం లేనట్టు ఆయా పార్టీల నాయకులు, కార్మిక సంఘాలు పట్టించుకోకపోవడం గమనార్హం.

# ఎమ్మెల్యే కూనమనేనిసాంబశివరావు కి

## బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేసిన సుజాతనగర్ గ్రామస్తులు



**భద్రాది కొత్తగూడెం,జూన్ 17(మన వార్త ప్రతిదీ పాలుగున)** బక్రీద్ పర్వదిన సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు గారిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన సుజాతనగర్ గ్రామస్తులుసుజాతనగర్ గ్రామానికి చెందిన గ్రామ పెద్దలు గ్రామంలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే సాంబశివరావు గారికి తెలియజేశారు వారు స్పందించి వెంటనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు అందరూ కలిసికట్టుగా పార్టీలకు అతీతంగా గ్రామ సమస్యల పరిష్కారం కోసం వచ్చినందుకు హర్షం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు తాళ్లూరి పాపారావు ధర్మారావు సిపిఐ మండల నాయకులు బొడ్డు కేశవరావు గ్రామ పెద్దలు బొడ్డు శివప్రసాద్ బుజ్జి చింతాల పూడి సాయి కుమార్ గురుజాల సీతయ్య గంగాధర కోటి చాగంటి వెంకటేశ్వర్లు గడ్డం రామారావు చారి తదితరులు పాల్గొన్నారు

# చందుర్తి మండల కేంద్రంలో బక్రీద్ వేడుకలు



**చందుర్తి మండల్, జూన్ 17 (మన వార్త ప్రతినిధి ముఖేష్):** చందుర్తి మండల కేంద్రంలో సోమవారం రోజున బక్రీద్ పండగ పురస్కరించుకొని ముస్లిం సోదరులు మసీదులో ప్రత్యేక ప్రార్థన చేశారు. ఒకరికొకరు అలై బలై తీసుకొని ప్రజలందరూ ఆయురారోగ్యాలతో , సుఖసంతోషాలతో ఉండాలని అల్లాను కోరారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులు తదితరులు పాల్గొన్నారు ,త్యాగానికి ప్రతీకగా నిలిచే బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారుముస్లిం సోదరులకు మండల పరిధిలోని వివిధ పార్టీలకు చెందిన నాయకులు కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేశారు,భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఆయా మసీదుల్లో మతపెద్దలు ప్రత్యేక సందేశం ఇచ్చారు. త్యాగనిరతికి ప్రతీకగా నిర్వహించుకునే బక్రీద్ ముస్లిం సమాజంలో సాటివాళ్లపై ప్రేమాభిమానాలు పంచేందుకు ప్రేరణ ఇవ్వాలని సూచించారు,ఈ కార్యక్రమంలో ముస్లింలు పాల్గొన్నారు.

# వేములవాడలో ఘనంగా బక్రీద్ వేడుకలు





**వేములవాడ, జూన్ 17 ( మన వార్తా ప్రతినిధి)** బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం ముస్లింలు ఉదయాన్నే నూతన వస్త్రాలు ధరించి ఈద్గాలకు చేరుకొని “ఈదుల్ అజా నమాజ్” చేశారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా పవిత్రమైన ఆధ్యాత్మిక భావనతో ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఒకరినొకరు అలింగానం చేసుకొని శుభాకాంక్షలు తెలుపుకుంటూ భక్తి శ్రద్ధలతో బక్రీద్ పండుగను జరుపుకున్నారు. అనంతరం ఈద్గాలో మౌలానా మాట్లాడుతూ దైవ ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ బక్రీద్ పండుగను జరుపుకుంటున్నామన్నారు, త్యాగ నిరతికి బక్రీద్ పండుగ నిదర్శనమని అన్నారు. ధనిక, పేద అన్న తారతమ్యం లేకుండా రాగదేశాలకు అతీతంగా ముస్లింలందరూ భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండగను జరుపుకున్నట్లు తెలిపారు.అలాగే ఈద్గాను ప్రతి సంవత్సరం పండగ ముందు రోజున సందర్శించి కావలసిన సదుపాయాలను తీర్చినందుకు మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి రాజు మున్సిపల్ కమిషనర్ జి.అన్వేష్, మున్సిపల్ సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బక్రీద్ విశిష్టతలో భాగమైన ముస్లింలు ఖుర్బానీని (మాంసాన్ని ) సగం పేదలకు, బంధువులకు పంచిపెట్టారు.ఈ వేడుకల్లో మత సామరస్యం వెల్లివిరిసింది. వేడుకల్లో మత పెద్దలు ముస్లిం నాయకులు, ప్రజా ప్రతినిధులు ముస్లింలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.ఈ బక్రీద్ పండగ సందర్భంగా వేములవాడ పట్టణ సీఐ, వీర ప్రసాద్ ఆధ్వర్యంలో ఈద్గా వద్ద ఎలాంటి అవాంచనీయాలు జరగకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

## సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చిన ఎంపీ.ఈటల రాజేందర్....



**మల్కాజ్గిరి జిల్లా (మన వార్త ప్రతినిధి:అంతోని)** మల్కాజ్గిరి జిల్లా సఫిలగూడ లేక్ పార్క్ లో బీజేపీ కార్పొరేటర్ శ్రవణ్ ఆధ్వర్యంలో,మల్కాజ్గిరి ఎం. పి.ఈటల రాజేందర్ రావడం జరిగింది.ఈ సందర్భంగా పలు కాలనీ వాసులుకి శుభాకాంక్షలు తెలిపి, పలు సమస్యలను దృష్టికి తీసుకు వచ్చారు.ముఖ్యంగా సఫిలగూడ లేక్ పార్క్ లో మురుగు నీటి శుద్ధికారణ యూనిట్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వాజపేయ్ నగర్ అండర్ పాస్, ఆనందబాగ్ లో ఎం. ఎం.టీ. ఎస్ స్టాప్.సఫిలగూడ రైల్వే గేట్ వద్ద ఎమర్జెన్సీ అండర్ పాస్, దోమల సమస్య తదితర సమస్యల పైన చర్చించడం జరిగింది.ఈ సందర్భంగా మాట్లాడుతూ తప్పక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమం లో జి. హెచ్ ఎం సి ఇంజనీరింగ్ అధికారులు మహేష్, దీపక్, వాటర్ వర్క్స్ అధికారులు భాస్కర్, నవీన్, టి. ఎస్. సి. పి. సి. డి. ఎల్ అధికారులు యాదగిరి, ఎంతోమలజీ సిబ్బంది రాంబాబు, దుర్గాప్రసాద్, శానిటైజషన్ సిబ్బంది శ్రీనివాస్, గిరి, బాలమని, ఆనందబాగ్, శ్రీకృష్ణ నగర్,దేవి నగర్, బలరాం నగర్, సీతారాం నగర్, లాఫింగ్ క్లబ్ సభ్యులు, కార్పొరేటర్ శ్రవణ్,రాజ్య లక్ష్మి, బీజేపీ నాయకులు రాంబాబు,డి.ఎన్ వెంకటేష్,మహేష్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బక్రీద్ వేడుకలు..



**-బక్రీద్ వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్యే**

**జమ్మికుంట, జూన్ 17( మన వార్త ప్రతినిధి):** త్యాగానికి ప్రతీకగా జరుపుకునే పండుగ బక్రీద్. ఈ పండుగను జమ్మికుంట పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాలలో ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. ప్రార్థనలు చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. జమ్మికుంట పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను భక్తి శ్రద్దల మధ్య ఘనంగా జరుపుకున్నారు. జమ్మికుంట పట్టణంలోని ఈద్గాల వద్ద ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చిన్నారులు ప్రత్యేక దుస్థులు ధరించి ఈద్గాల వద్ద ప్రార్థనలు చేయడం ఆకర్షించింది. మత గురువుల అనుసారంగా ప్రార్థనలు చేసి ఓకరికోకరు అలాయ్ బలాయి చేసుకోని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా మత గురువులు దైవాజ్ఞను అనుసరించి సమాజ హితంకోరి ప్రతీ మానవుడు నిస్వార్థ సేవలను అందించాలనే సందేశం బక్రీద్ మనకు అందిస్తుందని తెలిపారు. తమకు కలిగిన దాంట్లోంచి ఎంతో కొంత ఇతరులకు పంచడమనే దాతృత్వ స్వభావాన్ని బక్రీద్ పండుగ ద్వారా నేర్చుకోవాలని అన్నారు.ఈ వేడుకలలో హుజూరాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పాల్గొని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపి ఆలింగనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్యాగ నిరతికి బక్రీద్ పండుగ నిదర్శనం అని అన్నారు. ఈ పర్వదినం భక్తి, త్యాగం, కరుణ, విశ్వాసం అనే గొప్ప గుణాలను పెంపొందిస్తుందని, అల్లా దయ మీ అందరిపై ఉండాలని, మీరంతా సుఖశాంతులతో వర్ధిల్లాలని అని అన్నారు. ఎమ్మెల్యే తో పాటు మున్సిపల్ చైర్మన్ రాజేశ్వరరావు,సొసైటీ చైర్మన్ సంపత్, కౌన్సిలర్లు భాస్కర్,శ్రీనివాస్,నాయకులు పాల్గొన్నారు.



# ఘనంగా బక్రీద్ పండుగ వేడుకలు



**గంభీరావుపేట జూన్ 17 (మన వార్త ప్రతినిధి)**

గంభీరావుపేట మండలం లొ సోమవారం రోజున బక్రీద్ పండుగ పురస్కరించుకొని మసీదులలో మరియు ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు శాంతిని నెలకొల్పే విధంగా ఉండాలని ప్రార్థన చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# ఘనంగా బక్రీద్ పండుగ వేడుకలు



**గంభీరావుపేట జూన్ 17 (మన వార్త ప్రతినిధి )**

గంభీరావుపేట మండలం సోమవారం నరమాల గ్రామంలో బక్రీద్ పండగ పుర స్కరించుకొని మసీదులో మరియు ఈదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు శాంతిని నెలకొల్పే విధంగా ఉండాలని ప్రార్థన చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు

# శ్రీ సరస్వతీ శిశు మందిర్ లో సరస్వతి హెూమం.



**జమ్మికుంట, జూన్ 17( మన వార్త ప్రతినిధి):**

విద్యా సంవత్సర ప్రారంభం సందర్భంగా ఎలుబాక వరప్రసాద్ అయ్యగారు ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ లో ఘనంగా సరస్వతి హెూమము మరియు వాహనాల పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సరస్వతి విద్యాపీఠం జిల్లా కార్యదర్శి తేళ్ళ రాజమౌళి ,పాఠశాల సమితి కార్యదర్శి ఆకుల రాజేందర్, ప్రబంధకారిని అధ్యక్షులు శీలం శ్రీనివాస్, కార్యదర్శి దాసరి రవీందర్ , డాక్టర్ చిట్టి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, శ్రీమన్నారాయణ, విద్యారణ ఆవాసం గురుకుల విద్యాలయం ప్రధానచారి పోల్సాని సుధాకర్ రావు, బచ్చు శివకుమార్, దొంతుల రాజకుమార్ , గర్రెపల్లి నిరుపారాణి , బాదం రమేష్ , కొదురుపాక హరిప్రసాద్,పాఠశాల ప్రధాన ప్రధానాచార్యులు గుడికందుల సుదర్శన్, పాఠశాల ఆచార్య బృందము మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# భక్తి పారవశ్యం తో బిజిగిరి షరీఫ్ దర్గా సందల్ ఉత్సవం





**జమ్మికుంట, జూన్ 17( మన వార్త ప్రతినిధి):**

భక్తులతో కిటకిటలాడిన బిజిగిరి షరీఫ్ దర్గా .బిజిగిరి షరీఫ్ గ్రామంలోని హజ్రత్ సయ్యద్ ఇంకేషాప్ అలీ రహమతుల్లా అలై దర్గా సందల్ (గ్రంథ లేపనం) ఉత్సవం సోమవారం రాత్రి 11.00 గంటలకు మొళ్ళపల్లి గ్రామం మరియు పెద్ద బిజిగిరి షరీఫ్ గ్రామం నుండి భక్తిశ్రద్ధలతో, మేళతాళాలతో, అల్లాహ్ కీర్తనలతో ప్రారంభమై మంగళవారం తెల్లవారుజామున దర్గాకు చేరుకోగా



దర్గాలోని సమాధులకు సందల్ అలరింపజేసి చాదర్లు సమర్పించారు. మత గురువు మౌలానా యాసీన్ ప్రత్యేక ప్రార్థనలు చేసినారు. అనంతరం భక్తులు క్యూ లైన్ లో నిలబడి దర్గా దర్శనం చేసుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు . ఈ కార్యక్రమానికి జమ్మికుంట పట్టణ సిఐ వరంగంటి రవి,పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్గా ముతవల్లి మహమ్మద్ అక్బర్ అలీ ,దర్గా కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ ఇక్బాల్బీదర్గా కమిటీ ఉపాధ్యక్షుడు మొహమ్మద్ అబ్దుల్ కరీం, దర్గా కమిటీ కార్యనిర్వాహణ అధ్యక్షుడు మొహమ్మద్ తౌపిక్ హుస్సేన్, దర్గా కమిటీ కార్యదర్శి మహమ్మద్ జమాల్ అష్రఫ్,దర్గా కమిటీ సంయుక్త కార్యదర్శి మహమ్మద్ నయిముద్దీన్, షాహుస్సేన్ సభ్యులు అహమ్మద్, లతీఫ్ హుస్సేన్ ఆజమ్, జలీల్,తాజ్ తదితరులు పాల్గొన్నారు

# బిసి కుల వృత్తుల లక్ష రూపాయల లోన్లు ఏమయ్యాయి..



**జమ్మికుంట, జూన్ 17( మన వార్త ప్రతినిధి):**

బిసి కుల వృత్తుల లక్ష రూపాయల లోన్లు ఏమయ్యాయని హుజూరాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ని కాంగ్రెస్ నాయకులు నిలదీశారు.జమ్మికుంటలోని వినాయక గార్డెన్ లో కాంగ్రెస్ నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఎన్నికల ముందు కులవృత్తుల వారికి లక్ష రూపాయలు బీసీ లోన్లు ఏమయ్యయని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ని నిలదీశారు. బీసీ లోన్ల కోసం కులవృత్తుల వారు బీసీ కులం ధృవీకరణ దరఖాస్తు చేసుకొని తాసిల్దారు కార్యలయం చుట్టూ తిరిగి వాళ్ల పనులు మానేసి బీసీ సర్టిఫికెట్ల కోసం తిరిగి తిరిగి రెండు మూడు వేల రూపాయల ఖర్చు పెట్టుకుని బీసీ కుల ధృవీకరణ పత్రాలు తీసుకొని బీసీ లోన్ కోసం దరఖాస్తు చేసుకున్నారని గుర్తు చేశారు. కౌశిక్ రెడ్డి చాలామందికి ఎన్నికల ముందు అందరికీ బీసీ లోన్లు మంజూరు అయ్యాయి, చెక్కులు వచ్చాయి నా వద్దే ఉన్నాయని కౌశిక్ రెడ్డి చెప్పాడని అన్నారు. బీసీ లోన్లు ఎంతమందికి వచ్చాయి ఏ గ్రామానికి ఎన్ని చెక్కులు పంచారు చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీ లోన్లు మొత్తం ఏం చేశారని ప్రశ్నించారు. హుజరాబాద్ నియోజకవర్గం లో బీసీ బిడ్డలందరూ ఏ గ్రామానికి ఎన్ని బీసీ లోను మంజూరు అయ్యాయో కౌశిక్ రెడ్డి ని అడగండి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుడెపు సారంగ పాని, మొలుగురి సదయ్య, మండల, పట్టణ అధ్యక్షులు, కౌన్సిలర్లు పొనగంటి మల్లయ్య,బొంగిని వియన్న,శ్రీపతి నరేష్, దిడ్డి రాము,నాయకులు దేశినీ కోటి, బిట్ల మోహన్,అనిల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తపస్వి డాన్స్ అకాడమీ హుజురాబాద్ కి వన్నెతెచ్చింది..



-ప్రపంచ స్థాయి రికార్డు నెలకొల్పడం ఎంతో శుభ పరిణామం...

-హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి...

**జమ్మికుంట, జూన్ 17( మన వార్త ప్రతినిధి):**

ఒక వెయ్యి ఎనిమిది మంది మహిళలచే గోవింద నామాలతో కోలాట మహా బృంద నృత్యం ద్వారా హుజురాబాద్ లోని తపస్వి డాన్స్ అకాడమీ ప్రపంచ ప్రఖ్యాత గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ గ్రహీత, సహస్ర మహెూత్సవ సామ్రాట్ శ్రీ శాంతి కృష్ణ సేవా సమితి వారి గ్లోబల్ డివోషనల్ రికార్డ్స్ ను సాధించి హుజురాబాద్ కు వన్నె తీసుకువచ్చారని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అన్నారు. హుజరాబాద్ లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మొట్టమొదటిసారిగా ప్రపంచ స్థాయి రికార్డు నెలకొల్పడం ఎంతో శుభ పరిణామని ఇంతటి మహెూన్నత కార్యక్రమాన్ని నిర్వహించిన నృత్య దర్శకురాలు డా. చిలమకూరి శ్వేతా (సీతారత్నం) ఎంతో ప్రశంసనీయురాలని కొనియాడారు. ప్రభుత్వాలు ఏవైనా కళాకారుల అభివృద్ధి కోసం తన వంతు బాధ్యతతో కృషి చేస్తానని కళాకారులకు హామీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్రంలోని అనేక జిల్లాల నుండి హుజురాబాద్ కు విచ్చేసిన కళాకారులు అందరికీ ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు . హుజురాబాద్ నియోజకవర్గం లోని అక్కచెల్లెళ్లకు ఏ అవసరం ఉన్న తనను సంప్రదించాలని అన్నారు. ఎన్నికల సమయంలో ఏవైతే హామీలు ఇచ్చాను వాటిని నెరవేర్చడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. ఏ మహిళకు ఆపద వచ్చిన తనకు ఫోన్ చేస్తే తనవంతు సహాయ సహకారాలు తప్పక అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హుజురాబాద్ మునిసిపల్ చైర్ పర్సన్ గందె రాధిక, జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ రాజేశ్వరరావు, హుజురాబాద్ లోని ప్రముఖులు, పెద్ద ఎత్తున వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన కళాకారులు, కళాభిమానులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని

## విజయవంతం చేయండి..



**-మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్.**

**జమ్మికుంట, జూన్ 17( మన వార్త ప్రతినిధి):**

మాదిగల చైతన్యం కోసం, ఏబిసిడి వర్గీకరణ కోసం 1994 లో ఆవిర్భవించిన దండోరా (ఎమ్మార్పీఎస్) ఆవిర్భవించి, 30 ఏళ్లు వస్తున్న సందర్భంగా జూలై 7న వరంగల్ లో నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ పిలుపునిచ్చారు.వచ్చేనెల 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సన్నాహక జమ్మికుంట లోని ఒక ప్రైవేట్ గెస్ట్ హౌస్ లో సీనియర్ కళాకారుడు రామంచ భరత అధ్యక్షతన నిర్వహించగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశం జరిగేపార్టీలకు అతీతంగా, మాదిగల ఆత్మగౌరవం కోసం మాదిగలు మరియు మాదిగ ఉపకులాలు ఆవిర్భావ వేడుకలకు సమాయత్తం కావాలని అన్నారు. ఈ చారిత్రాత్మక సందర్భంగా విడుదల చేస్తున్న పాటలకు, పుస్తకాల ముద్రణకు తనవంతుగా సహకారం అందిస్తానని అన్నారు. ఏబిసిడి వర్గీకరణ అంశంలో మందకృష్ణన్న చేసిన త్యాగం మరువలేనిదని అన్నారు పార్టీలకతీతంగా మాదిగలు, మాదిగ ఉప కులాలు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి సంఘం సీనియర్ నాయకుడు నలిగంటి శరత్ మాట్లాడుతూ మాదిగ జాతికి మనందరం వారసులం కనుక ఈ కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొనాలని ఆహ్వానం పలికారు. కవిత్వం, పాటలు, వ్యాసాలు సమీకరించి పుస్తక రూపంలో అందించబోతున్నామని అన్నారు. రచయితలు తమ రచనలు ఈనెల 25 లోగా పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కవులు, కళాకారులు ముక్కెర సంపత్ కుమార్, డా. కట్కూరి మహేందర్, అశోక్ మోరే, గిద్దె రాంనర్సయ్య, అంబాల మధునయ్య, గోల్కొండ బుచ్చన్న, పుల్లూరు సమ్మయ్య (సమర్), జూపాక శివ, కన్నూరి ఆనంద్, కేతపాక ప్రసాద్, సీనియర్ దళిత సంఘాల నాయకుడు ఇమ్మడి సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విధులకు ఆటంకం కల్పిస్తే కఠిన చర్యలు తప్పవు...



**జమ్మికుంట, జూన్17( మన వార్త ప్రతినిధి )**

జమ్మికుంట పట్టణ సీఐ వరంగంటి రవి మాట్లాడుతూ సోమవారం రోజున ఉదయం హెడ్ కానిస్టేబుల్ భాస్కర్ రెడ్డి తన సిబ్బందితోపాటు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా కోరపల్లి గ్రామ శివారులో విలాసాగర్ వైపు నుండి ఒక ట్రాక్టర్ ఇసుకలోడుతో వస్తే అట్టి ట్రాక్టర్ను ఆపి పత్రాలు అడిగారు. వీటికి సంబంధించి ఇలాంటి పత్రాలు లేనందున అట్టి ట్రాక్టర్లు తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలిస్తుండగా మార్గమధ్యంలో సుమారు 06:20 నిమిషాలకు శ్రీదేవి రైస్ మిల్ జమ్మికుంట దగ్గరకు చేరుకునేసరికి ట్రాక్టర్ ఓనరు ఎదురుగా పల్సర్ బండి పై వచ్చి బండిని ఆపి బండిపై కూర్చుని ఉన్న హెూంగార్డ్ ఆఫీసర్ రవీందర్ ను ట్రాక్టర్ మీద నుంచి దించి, ట్రాక్టర్ తీసుకొని వెళ్ళిపోయినారు. నా విధులకు ఆటంకం కలిగించిన డ్రైవర్ వేల్పుల అనిల్ కుమార్ ఓనర్ వేల్పుల నాగరాజు మరియు బండ అరవింద్ లు ముగ్గురిపై కేసు నమోదు చేయనైనదని పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

# ఫ్యాన్ మర్డర్ - సరికొత్త మలుపులు



ఒక మంచి క్రైమ్ వెబ్ సిరీస్ కు సరిపడా కంటెంట్ కన్నడ స్టార్ హీరో దర్శన్ కేసులో దొరుకుతోంది. స్వయానా తన అభిమాని హత్య కేసులో చిక్కుకున్న ఈ కాటేరా కథానాయకుడు అంత సులభంగా బయటికి వచ్చేలా కనిపించడం లేదు. తాజాగా పోలీసులకు ఇచ్చిన స్టేట్ మెంట్ లో రేణుకస్వామిని తొలుత కిడ్నాప్ చేసిన సంగతి తనకు తెలియదని, సరే ఎలాగూ వచ్చాడు కదాని పవిత్రని తీసుకెళ్లి మరోసారి చేయొద్దని వార్నింగ్ ఇవ్వడం తప్ప ఏం చేయలేదని నమ్మబలికినట్టు తెలిసింది. అంతేకాదు వెళ్ళేటప్పుడు భోజనం చేసి వెళ్ళమని డబ్బులు కూడా ఇచ్చినట్టు పేర్కొన్నాడు. ఇదంత గుడ్డిగా నమ్మేలా లేదు. క్రమంగా మరిన్ని భీతిగొలిపే నిజాలు బయటికి వస్తున్నాయి. శాండల్ వుడ్ మీడియా ప్రకారం గత వారం రేణుకస్వామిని చిత్రదుర్గ నుంచి బెంగళూరుకి ఎత్తుకొచ్చారు. రాత్రి 7 గంటలకు దర్శన్ అభిమాని కి చెందిన షెడ్డుకి తీసుకొస్తే మరుసటి రోజు తెల్లవార్జుఝామున 3 గంటల వరకు చిత్రహింసలు పెట్టారట. పవిత్ర గౌడ చెప్పుతో అతన్ని కొడితే పలు ఆయుధాలతో దర్శన్, ఫ్యాన్స్ దారుణంగా గాయపరిచినట్టు ఆధారాలు దొరికాయట. గోడకేసి బాదాక చనిపోయాడని తెలిసి ఇదంతా మేనేజ్ చేయడానికి పవన్ అనే వ్యక్తికి 30 లక్షలు ఇచ్చినట్టు కథనాలు వస్తున్నాయి. ఇదే సొమ్ముని వినయ్ అనే వ్యక్తి గ్యాంగుకి నేరం మోయడానికి లంచంగా ఇచ్చారట. ఇదంతా జరిగే క్రమంలో ఒక పోలీస్ ఇన్స్ పెక్టర్ సహాయం చేసినట్టు వినిపిస్తోంది. దర్శన్ ఇంత ఘోరానికి పాల్పడినా కొందరు అబిమానులు సమర్ధిస్తూ నిరసనలు చేయడం పట్ల ఇప్పటికే కర్ణాటకలో ఆందోళన వ్యక్తమవుతోంది. పవిత్ర గౌడ, దర్శన్ తో సహా మొత్తం 15 మంది ఈ కేసులో నిందితులుగా ఉన్నారు. హీరో మాత్రం నేనేం చేయలేదని లాయర్ సలహా మేరకు సినిమా ఫక్కీలో నటిస్తున్నప్పటికీ వ్యవహారం మాత్రం అతన్ని పీకల్లోతులోకి దింపేసింది. ఇదంతా ఒక ఎత్తు అయితే దర్శన్ హీరోగా సెట్స్ మీదున్న సినిమాల్లో దాదాపు వంద కోట్లు బ్లాక్ అయినట్టు సమాచారం. పాపం నిర్మాతలు.

# నవ్విస్తూ భయపెట్టే మంచి దెయ్యం



నవ్విస్తూ భయపెట్టే మంచి దెయ్యంవెన్నెల కిషోర్, నందితా శ్వేత ప్రధాన పాత్రల్లో నటించిన హర్రర్, కామెడీ ఎంటర్‌టైనర్ 'ఓఎమ్‌జీ' (ఓ మంచి ఘోస్ట్). మార్క్‌సెట్ నెట్‌వర్క్స్ బ్యానర్ పై డా.అబినికా ఇనాబతుని నిర్మించిన ఈ చిత్రానికి శంకర్ మార్తాండ్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రం ఈనెల 21న రాబోతోంది. ఈ నేపథ్యంలో ఈ చిత్ర థియేట్రికల్ ట్రైలర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. 'ఈ బంగ్లాలో ఒక అమ్మాయిని చంపేశారు.. ఆ అమ్మాయే దెయ్యంగా మారి అందరినీ చంపేస్తోందని కథలుకథలుగా చెప్పుకుంటున్నారు' అనే డైలాగ్‌తో ట్రైలర్ ఆరంభమైంది. 'అందరి సమస్యలు వేరే అయినా వాటికి పరిష్కారం మాత్రం డబ్బు'.. అని ఓ గ్యాంగ్ పిశాచీపురంలోకి ఎంటర్ అవ్వడంతో ట్రైలర్‌లో ఫన్ ఎలిమెంట్స్ స్టార్ట్ అయ్యాయి. 'ఇప్పటి వరకు ఆటాడితే ఎలా ఉంటుందో చూశారు.. ఇప్పుడు వేటాడితే ఎలా ఉంటుందో చూపిద్దాం..' అంటూ అసలైన హర్రర్ బొమ్మని చూపించారు. ఈ ట్రైలర్ చూస్తుంటే ఎంతలా నవ్విస్తారో.. అంతలా భయపెట్టించేలా ఉన్నారు. అనూప్ రూబెన్స్ సంగీతం ఈ చిత్రానికి మేజర్ అస్సెట్ కానుంది. సినిమా తప్పకుండా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది అని చిత్ర యూనిట్ తెలిపింది.

# సూపర్ 8కు ఇంగ్లాండ్ గెలుపు




నార్త్‌సౌండ్ : గ్రూప్ దశలో వరుణుడి ఆటతోనే సూపర్8 సమీకరణాలు మారిపోగా.. కీలక చివరి మ్యాచ్‌లోనూ వరుణుడు అదే పని చేసేలా కనిపించాడు. గ్రూప్–బిలో నమీబియా, ఇంగ్లాండ్ మ్యాచ్‌తో వరుణుడు ఓ ఆట ఆడుకున్నాడు. సూపర్8కు చేరేందుకు తప్పక నెగ్గాల్సిన మ్యాచ్‌లో ఆట సాధ్యం కాకపోతే డిఫెండింగ్ చాంపియన్ ఇంటి బాట పట్టాల్సిన దుస్థితి. సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ ఆట మొదలైనా.. మళ్లీ వర్షంతో అడ్డంకులు.. మళ్లీ సవరించిన ఓవర్లతో ఇలా సాగిన మ్యాచ్‌లో ఇంగ్లాండ్ పైచేయి సాధించింది. డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో నమీబియాపై 41 పరుగులతో భారీ విజయం నమోదు చేసింది. గ్రూప్–బి నుంచి సూపర్8కు చేరుకున్న రెండో జట్టుగా నిలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ 10 ఓవర్లలో 122/5 పరుగులు చేసింది. ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ సాగుతుండగా వర్షం అంతరాయంతో 11 ఓవర్ల మ్యాచ్‌ను 10 ఓవర్లకు కుదించారు. ఫిల్ సాల్ట్ (11), జోశ్ బట్లర్ (0) నిరాశపరచగా ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ నెమ్మదిగా మొదలైంది. జానీ బెయిర్‌స్టో (31, 18 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), హ్యారీ బ్రూక్ (47 నాటౌట్, 20 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఇంగ్లాండ్‌కు భారీ స్కోరు అందించారు. మోయిన్ అలీ (16), లియాం లివింగ్‌స్టోన్ (13) ధనాధన్ ఇన్నింగ్స్‌లు ఆడారు. బ్రూక్ అజేయ ఇన్నింగ్స్‌తో ఇంగాండ్‌కు గెలుపు స్కోరు సాధించాడు. ఛేదనలో నమీబియా లక్ష్యాన్ని డక్‌వర్త్ పద్ధతిలో 10 ఓవర్లకు 126 పరుగులుగా సవరించారు. 10 ఓవర్లలో నమీబియా 3 వికెట్లకు 84 పరుగులే చేసింది. మైకల్ వాన్ (33), నికోలస్ (18), డెవిడ్ వైసీ (27) ఆకట్టుకున్నారు. హ్యారీ బ్రూక్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

# సుధీర్ బాబు కష్టానికి బ్రేకులు



చాలా గ్యాప్ తరువాత సుధీర్ బాబు సినిమా డిజాస్టర్ కాదు పర్వాలేదనిపించుకున్న సినిమా హరోంహర. మరీ యునానిమస్ గా పాజిటివ్ టాక్ రాకపోయినా ఉన్నంతలో ఒక మాస్ వర్గంతో ఓకే అనిపించుకునే కంటెంట్ అయితే ఉంది. అయితే ఊహించని విధంగా తమిళ డబ్బింగ్ మహారాజ దీని వసూళ్లను ప్రభావితం చేయడం మాత్రం షాక్ కలిగించే విషయం. రిలీజ్ ముందు వరకు విజయ్ సేతుపతి మూవీ మీద అంతగా బజ్ లేదు. పదమూడో తేదీ రాత్రే ప్రీమియర్లు వేశాక సీన్ మారిపోయింది. ఉదయం ఆటలకు జనం అంతంత మాత్రంగా ఉన్నా సాయంత్రానికి సీన్ మొత్తం మారిపోయింది. హరోంహర నెమ్మదించేయగా మహారాజా బాగా పికప్ అవుతున్నాడు. గత రెండు రోజుల్లో బుక్ మై షోలో తెలుగు తమిళ వెర్షన్లు కలిపి రెండు లక్షలకు పైగా టికెట్లు అమ్ముడుపోవడం దానికి నిదర్శనం. ఏపీ తెలంగాణ మెయిన్ సెంటర్స్ లో షేర్ బాగా వస్తోంది. బిసి కేంద్రాల్లో కొంత స్లోగా ఉన్నప్పటికీ కౌంటర్ సేల్స్ బాగున్నాయని బయ్యర్ల రిపోర్ట్. ఎలాగూ సోమవారం బక్రీద్ సెలవు దినం కావడంతో వీకెండ్ మొత్తం నాలుగు రోజుల్లో లాభాల్లోకి అడుగు పెట్టడం ఖాయమని ట్రేడ్ టాక్. నైజం పంపిణి చేసిన మైత్రి మరోసారి జాక్ పాట్ కొట్టినట్టే కనిపిస్తోంది. సులభంగా బ్రేక్ ఈవెన్ అయ్యే దిశగా వెళ్తోంది.ఒకవేళ మహారాజ లేకుండా కేవలం హరోంహర మాత్రమే వచ్చి ఉంటే సుధీర్ బాబు కొంత డామినేట్ చేసే అవకాశం దక్కేది. అలా అని వసూళ్లు మరీ బ్యాడ్ గా లేవు కానీ ఆశించిన స్థాయిలో వేగం లేదన్నది వాస్తవం. దర్శకుడు జ్ఞానసాగర్ మాస్ ఎలివేషన్లతో నింపేసిన వైనం అన్ని వర్గాలను పూర్తిగా మెప్పించలేకపోతోంది. ఇంకొంచెం బెటర్ గా ఉండి ఉంటే ఖచ్చితంగా మహారాజ మీద ఆధిపత్యం చెలాయించేది. వీకెండ్ అయ్యాక హరోంహర ఫైనల్ స్టేటస్ ఏ విధంగా ఉండబోతోందనే దాని మీద స్పష్టత వస్తుంది. ఎలాగూ జూన్ 27 కల్కి దాకా పెద్దగా సినిమాల్లేవ్ కాబట్టి ఈ ఛాన్స్ వాడుకోవాలి.

# స్కాట్లాండ్ పై ఆస్ట్రేలియా విజయం!




ఐదు వికెట్ల తేడాతో స్కాట్లాండ్ పై ఆస్ట్రేలియా విజయం సాధించింది. దీంతో ఇంగ్లాండ్ సూపర్–8 కు దూసుకెళ్లింది. టీ20 వరల్డ్ కప్ 2024 లో భాగంగా గ్రూప్– బి లోని స్కాంట్లాండ్, ఆస్ట్రేలియాలు దేశాలు తలపడ్డాయి.సెయింట్ లూసియా వేదికగా జరిగిన ఈ మ్యాచ్ లో ముందుగా బ్యాటింగ్ చేసిన స్కాంట్లాండ్ జట్టు ఐదు వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. స్కాట్లాండ్ బ్యాటర్లలో బ్రెండన్ మెక్ కల్లమ్ 34 బంతుల్లో 60 పరుగులు, బెర్రింగ్ టన్ 31 బంతుల్లో 42 పరుగులతో ఉత్తమ ప్రదర్శన కనబర్చారు. 181 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా ఐదు వికెట్ల నష్టంతో మరో రెండు బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని చేదించింది. వీరిలో ట్రావిస్ హెడ్ 49 బంతుల్లో 68 పరుగులు చేయగా, స్టోయినీస్ కేవలం 29 బంతుల్లో 59 పరుగులతో చెలరేగిపోయారు. ఇక స్కాంట్లాండ్ ఓటమి ఇంగ్లాండ్ కు కలిసివచ్చినట్టు అయ్యింది. గ్రూప్ బి లో వరుసగా నాలుగు మ్యాచ్ లు గెలిచిన ఆస్ట్రేలియా ఇప్పటికే సూపర్–8 కు చేరుకోగా.. ఇంగ్లాండ్, స్కాట్లాండ్ చెరో ఐదు పాయింట్లతో క్వాలిఫై కోసం పోటీ పడుతున్నాయి. ఈ మ్యాచ్ లో స్కాట్లాండ్ ఓడిపోవడంతో రన్ రేట్ ఎక్కువగా ఉన్నందుకు ఇంగ్లాండ్ సూపర్–8 కు చేరుకుంది.

# గట్టి పోటీ ఇచ్చిన సెర్బియా ఓటమి



ఇంగ్లాండ్ సెర్బియా నుంచి గట్టిపోటీని తట్టుకుని 1–0 తేడాతో గెలిచింది. యూరో కప్ ఫుట్‌బాల్‌లో తొలిసారి బరిలోకి దిగిన ఇంగ్లాండ్ ఒక్క గోల్‌తో సెర్బియాను ఓడించింది. మొదటి అర్ధభాగంలో ఇంగ్లాండ్ ఆటగాడు జూడ్ బెల్లింగ్‌హామ్ విజయవంతమైన గోల్ చేశాడు. భారీ విజయంపై ఆశతో వచ్చిన ఇంగ్లాండ్ ను సెర్బియా డిఫెన్స్‌తో మట్టికరిపించింది. సూపర్ స్టార్లతో నిండిన ఇంగ్లాండ్ జట్టును సెర్బియా అడ్డుకున్న తీరు ఆకట్టుకుంది. 13వ నిమిషంలో బుకాయో సాకా అందించిన క్రాస్ నుండి బెల్లింగ్‌హామ్ హెడర్‌తో గోల్ గా మలిచి 1–0 ఆధిక్యం సంపాధించింది. గోల్ కొట్టిన తర్వాత సెర్బియన్లు ఇంగ్లాండ్ దాడిని అడ్డుకున్నాడు. ఇంగ్లాండ్ కెప్టెన్ హ్యారీ కేన్ తొలి అర్ధభాగంలో కేవలం రెండుసార్లు మాత్రమే బంతిని తాకగలిగాడు. సెర్బియా కూడా కౌంటర్ అటాక్స్ ద్వారా గోల్ చేసేందుకు ప్రయత్నించింది. కానీ ఫలితం లేదు. రెండో అర్ధభాగంలో ఇరు జట్లు దూకుడుగా ఆడాయి. కేన్ యొక్క హెడర్ బార్ నుండి బౌన్స్ అయింది. సెర్బియా ఆటగాడు దుసాన్ వ్లహెూవిచ్ కొట్టిన షాట్‌ను ఇంగ్లండ్ గోల్ కీపర్ జోర్డాన్ పిక్‌ఫోర్డ్ అడ్డుకోవడంతో పరాజయం తప్పలేదు. ఇంగ్లండ్ తదుపరి మ్యాచ్ 20న డెన్మార్క్‌తో జరగనుంది. సెర్బియా స్లోవేనియాతో తలపడనుంది. గ్రూప్–సిలో ఇంగ్లండ్ మూడు పాయింట్లతో ముందంజలో ఉంది.

# అఫ్గాన్ టీమ్‌కు భారీ షాక్..




టీ20 ప్రపంచకప్‌లో ఆఫ్ఘనిస్థాన్ జట్టు వరుసగా మూడు మ్యాచ్‌లు గెలిచి సూపర్–8కి అర్హత సాధించింది. జట్టు ఇంకా తన చివరి గ్రూప్ స్టేజ్ మ్యాచ్ ఆడలేదు. అయితే అంతకు ముందు ఆ జట్టుకు ఎదురుదెబ్బ తగిలింది. అంటే సూపర్ 8 రౌండ్ ప్రారంభానికి ముందే ఆ జట్టు స్టార్ బౌలర్ మొత్తం టోర్నీ నుంచి ఔట్ అయ్యాడు. ఆ జట్టు స్టార్ బౌలర్ ముజీబ్ ఉర్ రెహ్మాన్ టోర్నీలో మిగిలిన మ్యాచ్‌లు ఆడడం లేదని బోర్డు తెలిపింది. వేలి గాయం కారణంగా అతను టోర్నీకి దూరమయ్యాడు. ఉగాండాతో మ్యాచ్ తర్వాత, అతను న్యూజిలాండ్ లేదా పపువా న్యూ గినియాతో జరిగిన మ్యాచ్‌లో ఆడలేదు. దీంతో ఆఫ్ఘనిస్థాన్ బోర్డు కూడా ఈ బౌలర్‌ను భర్తీ చేస్తున్నట్లు ప్రకటించింది. ముజీబ్ స్థానంలో, జట్టు ఓపెనర్ హజ్రతుల్లా జజాయ్‌ను జట్టులోకి తీసుకున్నారు. జట్టు కోచ్ జోనాథన్ ట్రాట్ ప్రకారం, ముజీబ్ స్థానంలో ఇప్పటికే నూర్ అహ్మద్ రూపంలో ఒక బౌలర్ జట్టులో ఉన్నాడు. ఇలాంటి పరిస్థితుల్లో హజ్రతుల్లా జజాయ్ రాకతో జట్టు బ్యాటింగ్ మరింత పటిష్టం అవుతుందన్నారు. కాగా ఆఫ్ఘనిస్థాన్ తరఫున టీ20 ఇన్నింగ్స్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడు జజాయ్. ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 62 బంతుల్లో 162 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఈ ఇన్నింగ్స్‌లో 11 ఫోర్లు, 16 సిక్సర్లు ఉన్నాయి. అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో జట్టుకు ఇది రెండో అత్యధిక వ్యక్తిగత ఇన్నింగ్స్. ఫిబ్రవరి నుంచి జజయ్ టీ20 మ్యాచ్‌లు ఆడలేదు. అయితే, అతను గత రెండు టీ20 ప్రపంచకప్‌లలో ఆఫ్ఘనిస్థాన్‌కు ప్రాతినిధ్యం వహించాడు. ఆఫ్ఘనిస్థాన్ జట్టు: రషీద్ ఖాన్ (కెప్టెన్), రహమానుల్లా గుర్బాజ్, ఇబ్రహీం జద్రాన్, అజ్మతుల్లా ఒమర్జాయ్, నజీబుల్లా జద్రాన్, మహ్మద్ ఇషాక్, మహ్మద్ నబీ, గుల్బాదిన్ నాయబ్, కరీం జనత్, నంగ్యల్ ఖరోటీ, నూర్ అహ్మద్, ఫకీన్, ఫకీన్–అల్– మాలిక్, హజ్రతుల్లా జజాయ్. రిజర్వ్‌లు: సాదిక్ అటల్, సలీం సఫీ